క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం


దాత ప్రభాల రమేష్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన చాగంటి ఫణికుమార్ ఆయన కుటుంబ సభ్యులు రూ.10వేల విరాళం అందజేశారు. అలాగే అమలాపురానికి చెందిన ప్రభాల రమేష్ ఆయన కుటుంబ సభ్యులు రూ.25 వేలు విరాళం అందజేశారు. దాతలు ఈ సొమ్మును ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు. దాతను ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

లక్ష్మీనృసింహునికి జన్మనక్షత్ర పూజలు


అంతర్వేదిలో పవిత్ర నదీజలాల కలశతో ప్రదక్షిణం చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని బుధవారం స్వామివారికి అష్టోత్తర కలశాభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. తొలుత వశిష్ట గోదావరి నది నుంచి కలశాలతో తెచ్చిన పవిత్ర జలాల కలశతో అర్చకులు వేదమంత్రాలతో ఆలయ ప్రదక్షిణం చేశారు. వీటితో పాటు పంచామృతాలతో, వేదమంత్రోచ్చారణల మధ్య స్వామికి విశేష అభిషేకం, పూజలు చేశారు. ఆలయ ఏసీ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్‌ను అందించిన మెగా అభిమానులు

రాజోలు: పదో తరగతి విద్యార్థులకు మెగా ఫ్యాన్స్ బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. గేమ్ ఛేంజర్ సినిమా బెనిఫిట్ షో ఆదాయం ద్వారా యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను కొనుగోలు చేసి రాజోలు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేశారు. మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు, పొదలాడ నీటి సంఘం అధ్యక్షుడు ఉలిశెట్టి లక్ష్మణ్, నాయకులు సూరిశెట్టి శ్రీను, గుండాబత్తుల తాతాజీ, హెచ్ఎం కె.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయ కేంద్రాలపై దాడులు

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మండపేటలో సారా విక్రయిస్తున్న కేంద్రాలపై బుధవారం దాడులు జరిగాయి. స్థానిక ఎక్సైజ్ సీఐ ఐడి.నాగేశ్వరరావు కథనం ప్రకారం పట్టణంలో సారా విక్రయిస్తున్న బి.నరేష్, మోరంపూడి సన్యాసిరావును అరెస్టు చేసి వారి వద్ద నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని ఆలమూరు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా నిందితులిద్దరికీ 15 రోజుల రిమాండ్ విధించినట్లు ఆలమూరు ఎక్సైజ్ సీఐ తెలియజేశారు.

లోపాలు లేకుండా రీ సర్వే పూర్తి చేయాలి

రావులపాలెం: త్వరలో నిర్వహించనున్న రీసర్వేలో ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించేలా అధికారులు కృషి చేయాలని ఆర్డీవో శ్రీకర్ అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని పొడగట్లపల్లి గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశామన్నారు. ఈ గ్రామంలో రీ సర్వే ఎటువంటి లోపాలు లేకుండా రైతులను ఒప్పించి పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దారు ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరం, సఖినేటిపల్లి గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వపరంగా రైతులకు అమలు చేస్తున్న పథకాల గురించి ఏవో పీవీ నరసింహారావు వివరించారు. అలాగే ఆధునిక సేద్యం, మేలైన వ్యవసాయ పద్ధతులు గురించి కూడా మండల ఏవో తెలిపారు. పంటలపై పడే తెగుళ్లను నిఘా, నిర్వహణ చేయడానికి ఉద్దేశించిన నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో సాయిల్ హెల్త్ కార్డులను జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ పంపిణీ చేశారు.

ఏటా తప్పని ముంపు సమస్య

- పాశర్లపూడి బాడవలో రైతుల వ్యథ
- ఇంకా ముంపులోనే పొలాలు


పాశర్లపూడిబాడవలో ముంపులో ఉన్న పంట పొలాలు


ముంపు సమస్యతో పంట పొలాల్లో మొలిచిన గడ్డి దుబ్బులు

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ రైతులు ప్రతి ఏడాది ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. ముంపు నీటితో మొదటి పంట కోల్పోతున్నారు. సుమారు రెండు దశాబ్దాల నుంచి ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. సుమారు 200 ఎకరాల పంట భూములు ముంపు సమస్యతో ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం రెండో పంటకు కూడా ముంపు సమస్య రైతులను వెన్నాడుతోంది. గతంలో ఓఎన్జీసీ తమ కార్యకలాపాల కోసం పంట పొలాల మధ్యలో నుంచి రోడ్లు ఏర్పాటు చేయడం ముంపునకు ప్రధాన సమస్యగా మారింది. దీనికి తోడు వాడబోది మీడియం డ్రైన్ ద్వారా ముంపు నీరు వైనతేయ గోదావరి నదిలో కలవాల్సి ఉంది. గోదావరి నది పాటు సమయంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్ తలుపులు తెరచి, పోటు సమయంలో షట్టర్లు మూసేయాల్సి ఉంది. కానీ అది సక్రమంగా జరగడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీని వల్లే రెండో పంటకు కూడా ముప్పు వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముంపు నీరు దిగే మార్గం లేదు...

సార్వా పంట ఎలాగూ సాగు చేసే అవకాశం లేదు. పోనీ దాళ్వా పంట సాగు చేద్దామని ఆశించిన రైతులు నారుమడులు వేశారు. తీరా దమ్ము చేద్దామంటే పంట పొలాలు ఇంకా చెరువులను తలపిస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సమీపంలోని పొలాల్లో నాటు వేసి పది రోజుల దాటింది. కానీ మేము దమ్ము చేయిద్దామంటే నీరు దిగడం లేదు. ఏం చేయాల్లో పాలుపోవడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, అయినా ఫలితం మాత్రం కనిపించలేదని రైతులు వాపోతున్నారు. సార్వా పంటతో పాటు దాళ్వా పంటకు ముంపు సమస్య తప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు పంట పొలాల్లోని ముంపు నీటిని ఆయిల్ ఇంజిన్లతో బయటకు మళ్లిస్తున్నారు. తమ సమస్యపై అధికారులు తక్షణం స్పందించి పంట పొలాల్లోని ముంపు నీరు కిందికి దిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పొలం మొత్తం ముంపులోనే ఉంది


నాకు మూడెకరాల పొలం ఉంది. పొలం మొత్తం ముంపులోనే ఉంది. ముంపు నీటిని ఆయిల్ ఇంజిన్ సహాయంతో బయటకు పంపిస్తున్నాను. ఏం చేయాల్లో తెలియని అయోమయ పరిస్థితి. సార్వా పంట లేదు. దాళ్వా అయినా సాగు చేద్దామంటే ముంపు నీరు చేలో నిలిచి ఉంది. ఏం చేయాల్లో దిక్కుతోచడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదు. 20 ఏళ్ల నుంచి ఇదే సమస్య వేధిస్తోంది. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

– చప్పిడి శ్రీను, బాధిత రైతు

స్లూయిజ్ తలుపులు ఎత్తేయడం వల్లే ముంపు


రొయ్యల రైతుల కోసం ఆదుర్రులోని అయిట్ ఫాల్ స్లూయిజ్ తలుపులు ఎత్తేయడం వల్లే ముంపు సమస్య ఎదుర్కొంటున్నాం. గోదావరి పోటు సమయంలో ముంపు నీరు కొబ్బరి తోటలను కూడా ముంచెత్తుతోంది. పాటు సమయంలో షట్టర్లు తెరచి ముంపు నీటిని గోదావరి నదిలోకి మళ్లించాల్సి ఉంది. కానీ పోటు సమయంలో కూడా షట్టర్లు తెరచి ఉంచడం మాకు ప్రధాన సమస్యగా మారింది. దీనిపై ఉన్నతాధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– వంగా వెంకటభాస్కరరావు, రైతు

రెండు పంటలకూ ముంపు ముప్పు


ఓఎన్జీసీ నిర్మించిన రోడ్ల వల్ల మొదటి పంట కోల్పోతున్నాం. హెడ్ వర్క్స్ సిబ్బంది వల్ల రెండో పంటకు కూడా ముప్పు తప్పడం లేదు. ముంపు సమస్యపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. ఏం చేయాలో తెలియని అయోమయంలో ఉన్నాం. పంట పొలాలను చూస్తే గుండె తరుక్కుపోతోంది. సారవంతమైన భూములు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. అధికారులు తక్షణం సమస్యపై స్పందించి దీనిని పరిష్కరించాలి.

– మోకా విజయ్, రైతు

నేడు ప్రకృతి వ్యవసాయంపై సదస్సు

అంబాజీపేట: కొబ్బరి అంతరపంటల్లో ప్రకృతి వ్యవసాయంపై సదస్సును అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో గురువారం నిర్వహించనున్నట్లు కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తెలిపారు. ఈ సదస్సుకు కాసరగాడ్ సీపీసీఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రవిభట్ పాల్గొననున్నారన్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పథకాలు, కొబ్బరిలో ప్రకృతి వ్యవసాయం, కొబ్బరిలో పుప్పొడి, పిందెల ఎదుగుదల, కొబ్బరిచెట్టు మొవ్వలను పరిశీలించనున్నారన్నారు. అలాగే కేంద్రంలో నిర్వహిస్తున్న పరిశోధనలను సమీక్షిస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, ఉద్యాన అధికారులు అధిక సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మెగా వైద్య శిబిరం

రావులపాలెం: మండలంలోని ఈతకోట టోల్ ప్లాజా వద్ద బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 36వ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా టోల్ ప్లాజా మేనేజర్ కేవీవీఎస్ఎన్ రెడ్డి నేతృత్వంలో రాజమహేంద్రవరం డెల్టా ఆస్పత్రి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వాహన డ్రైవర్లకు వినియోగదారులకు వైద్య సేవలు అందించారు. సుమారు 125 మంది ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు. అలాగే వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ కె బాలసుబ్రమణ్యం, హైవే అధికారులు అగర్వాల్, సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సభలో నిరసన గళం


గ్రామసభలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ

మలికిపురం: రామరాజులంక పంచాయతీ సమావేశం రసాభాసగా జరిగింది. సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో నాయకులు పలు సమస్యలు లేవనెత్తారు. వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ మాట్లాడుతూ గత రెండేళ్లుగా పంచాయతీ గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదులు ఏ మేరకు సమస్యల పరిష్కారానికి నోచుకోలేదని, మరీ ముఖ్యంగా మంచినీటి సమస్య ఉన్న చోట్ల గత గ్రామసభల్లో మహిళలు ఇచ్చిన దరఖాస్తులను ఏ విధంగా పరిశీలన చేయక కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ఆర్‌జీఎస్ పనులు సక్రమంగా నిర్వర్తించట్లేదని గ్రామంలో పేరుకుపోయిన చెత్త పంచాయతీ సిబ్బంది తీయించడం లేదని, సక్రమంగా వార్డు మెంబర్లు సమావేశానికి రావట్లేదని, రోడ్ల విషయంలో కూడా ఎస్సీ ఏరియాలో ఏమాత్రం ప్రాతినిధ్యం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పంచాయతీకి వచ్చే సమస్యల పరిష్కారానికి త్వరలో కమిటీ వేసి నిర్ణయం తీసుకుంటామని సర్పంచ్ శ్రీను అన్నారు. సభలో ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, ఉపసర్పంచ్ మేడిచర్ల గంగరాజు, ఎంపీటీసీ మేడిచర్ల వెంకటరాజు, నీటి సంఘం అధ్యక్షుడు ముద్దాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులతో నిధుల వృథా

- రూ.40 లక్షల రోడ్డు.. నాలుగు రోజులకే శిథిలం
- పరిశీలించిన మాజీ మంత్రి గొల్లపల్లి


నిర్మాణం జరిగిన నాలుగు రోజులకే తారు లేచిపోయిన రోడ్డు


రూ.40 లక్షలతో వేసిన రోడ్డు పై పడిన గోతులు

మలికిపురం: నియోజకవర్గంలో చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణంలో నాసిరకం పనులు బయటపడ్డాయి. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండు రోడ్లు పూర్తి స్థాయి నాసిరకం పనుల వల్ల రోడ్డు వేసిన నాలుగు రోజులకే శిథిలం అయ్యాయి. మలికిపురం మండలం గుడిమెళ్లంక అయ్యవారి తిప్ప నుంచి విశ్వేశ్వరాయపురం పంచాయతీ వరకూ చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్డు తారు లేచిపోయి గోతులు పడింది. వాహనాల టైర్లు రాపిడికే తారు లేచి పోవడం , గోతులు పడడంపై ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర విస్మయం చెందుతున్నారు. సంక్రాంతికి రెండు రోజుల ముందు హడావుడిగా ఆర్అండ్‌బీ అధికారులు ఈ రోడ్డు పనులు పూర్తి చేశారు. ఆ సమయంలో ఇక్కడ ఆర్అండ్‌బీ అధికారులు సైతం పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం. కాంట్రాక్టర్లు తమ ప్రైవేటు సిబ్బందితో మెటీరియల్ పరుచుకుని పోయారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రూ.40 లక్షలకు పైగా నిధులు సుమారు 3 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణానికి వెచ్చించింది. ఇంతకు ముందు ఇదే రోడ్డుపై వైఎస్సార్ సీపీ హయాంలో చేసిన తాత్కాలిక పనుల వల్ల ఐదేళ్ల పాటు రోడ్డు దృఢంగా ఉంది. పూర్తి స్థాయిలో వేసిన ప్రస్తుత రోడ్డు వేసిన నాలుగు రోజులకే ఇలా కావడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రూ. 15 లక్షల పైబడి నిధులతో వేసిన లక్కవరంలోని జగజ్జీవన్ విగ్రహం నుంచి బట్టేలంక వరకూ వేసిన రోడ్డు సైతం నాణ్యత లోపంతో తారు లేచిపోతోంది. ఈ రోడ్ల దుస్థితిపై మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో బుధవారం ఆయన రోడ్లను పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగం చేసిందని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

మామిడికుదురు: రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ సూచించారు. మొగలికుదురు శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ అనే అంశంపై క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. సడక్ సురక్ష, జీవన్ సురక్ష అనే నినాదంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏజీఎం రాజ్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సుధా లక్ష్మి, డీన్ రమేష్, ఇన్‌చార్జ్ శ్రీనివాస్, వెంకటేష్, ఏఓ బాలు పాల్గొన్నారు.

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ

సఖినేటిపల్లి: పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీసు స్టేషన్ నుంచి టేకిశెట్టిపాలెం ఎత్తు వంతెన వరకూ ఈ ర్యాలీ చేశారు. ముఖ్య అతిథిగా రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ పాల్గొన్నారు. ప్రయాణికుల భద్రతకు హెల్మెట్ ఉపయోగాలను సీఐ వివరించారు. ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, పలువురు తెలుగు యూత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: స్థానికంగా ఓ పాఠశాలలో బుధవారం రావులపాలెం ఎంవీఐ ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు, రోడ్లపై రాకపోకలుపై జాగ్రత్తలు, డ్రైవింగ్‌లో పాటించాల్సిన నియమాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలలో విజేతలకు వారోత్సవాల చివరి రోజు బహుమతులను అందజేస్తామని అధికారులు తెలిపారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి


ముక్కామలలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దీపిక

అంబాజీపేట: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతుల అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించాలని పశువైద్యాధికారి దీపిక అన్నారు. ముక్కామలలో పశు వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. దీపిక మాట్లాడుతూ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో పశువులు బరువు పెరిగి ఆరోగ్యంగా ఉండటంతో పాటు పాల ఉత్పత్తి పెరగడం, పునరుత్పత్తి పెరుగుతుందని వ్యాధి నిరోధకశక్తి పుంజుకుంటుందని వివరించారు. చిన్నగోకులం షెడ్లు, బహువార్షిక పశుగ్రాస క్షేత్రాలు, పశుబీమా, పశుకిసాన్, క్రెడిట్ కార్డులు, సంచార పశుఆరోగ్య సేవా వాహనాలు, లింగ నిర్ధారిత వీర్యం, పిండ మార్పిడి పరిజ్ఞానం తదితర పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆవులకు గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

శివకోడులో..

రాజోలు: ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం శివకోడులో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ నక్కా రామరావు ప్రారంభించారు. గ్రామానికి చెందిన రైతులు తమ పశువులను తీసుకుని రాగా వాటికి రోగనిరోధక టీకాలు వేశారు. అలాగే పశువుల ఆరోగ్య సమృద్ధి కోసం మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. మండల పశు వైద్యాధికారి సంపత్‌కుమార్, జేవీఓ విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పి.గన్నవరం: స్థానిక మూడు రోడ్ల సెంటర్లో మంగళవారం రాత్రి వేగంగా మలుపు తిరుగుతున్న ఒక లోడు లారీ ఒక వైపునకు పూర్తిగా ఒరిగిపోయి పల్టీ కొడుతుందన్న సమయంలో తిరిగి యథాస్థితికి చేరుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో లారీ పక్క నుంచి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు సేఫ్‌గా బయట పడటంతో స్థానికులు, వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. ఏజీ రోడ్డు ఆధునీకరణలో భాగంగా మూడు రోడ్ల సెంటర్‌లో ఒక వైపున రెండు అడుగుల మేర రోడ్డును ఎత్తు చేశారు. దీంతో మరోవైపున రోడ్డు పల్లంగా ఉంది. రావులపాలెం నుంచి అంబాజీపేట వైపు వేగంగా మలుపు తిరిగిన లారీ డైవర్.. సెంటర్లో ఎత్తు, పల్లాలను గమనించలేదు. దీంతో లారీ మరొక వైపునకు ఒరిగిపోయి పల్టీ కొడుతుందన్న సమయంలో తిరిగి యథాస్థితికి చేరుకుంది. లారీకి ఎదురుగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు లారీ తమ మీద పడిపోతుందని ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఏ విధమైన ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం సెంటర్లో ఎత్తుపల్లాలను సరి చేశారు.

పి.గన్నవరం కోఆర్డినేటర్‌కు పలువురి అభినందన


శ్రీనివాసరావును అభినందిస్తున్న పార్టీ నాయకులు

అయినవిల్లి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమితులైన అయినవిల్లి మండల జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావును బుధవారం నియోజక వర్గంలోని పార్టీకి చెందిన ప్రముఖులు కలసి అభినందనలు తెలిపారు. అలాగే వారు గన్నవరపు శ్రీనివాసరావుకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. వీరిలో వైఎస్సార్ సీపీ మామిడికుదురు మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, ఉప్పలగుప్పం జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, తులా గోపాలకృష్ణ, జక్కంపూడి వాసు, బొరుసు నరసింహమూర్తి, దాసరి అరుణ, వాసంశెట్టి తాతాజీ, మేడిశెట్టి శ్రీను, మిండగుదిటి చిన్ని, కతకంశెటి ఆదిత్య తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి ప్రతిభా పరీక్షలో విజేతలు


విజేతల వివరాలను ప్రకటిస్తున్న నిర్వాహకులు

మామిడికుదురు: జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరం సాయిదీప్తి ఐఐటీ, మెడికల్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయిలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి 300 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 268 మంది క్వాలిఫై అయ్యారని విద్యాసంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ తెలిపారు. విజేతల వివరాలను ప్రకటించారు. ప్రైవేట్ స్కూల్స్ విభాగంలో కొత్తపల్లి శంకర్, బళ్ల సాయికార్తీక, చొల్లంగి వర్షిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. ప్రభుత్వ స్కూల్స్ విభాగంలో గంటా స్వాతి, పైడిపర్తి విజయశివాణి, వేగి హర్షిత, మొల్లా ఫాతిమా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జక్కంపూడి శివప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ అభివృద్ధికి కృషి


ఆలమూరులోని ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు తదితరులు

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో బుధవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొని ఆయన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా శిరిగినీడి పట్టాభి, చీపురుపల్లి గణేష్, జి.సూర్యకుమారి ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. అనంతరం ఆస్పత్రిని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వైద్యురాలిని నియమించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభమైంది. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ అధినేత పాడిశెట్టి కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌ను జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసుతో కలసి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఎంఈఓలు భమిడిపాటి అప్పాజీ, ఎస్‌వీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా లెప్రసీ సర్వే


పాశర్లపూడిలో సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు

మామిడికుదురు: జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పాశర్లపూడిబాడవలో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు బుధవారం ఇంటింట సర్వే నిర్వహించారు. కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అసిస్టెంట్ కొమ్ముల సూర్యనారాయణ సూచించారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు కుష్ఠు వ్యాధి లక్షణాలన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వారు వెంటనే తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వి.రమ్య, ఏఎన్ఎం జీవీఆర్ కుమారి, ఆశ కార్యకర్తలు కె.సూర్యావతి, చిలకమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలి


కడలిలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

రాజోలు: వరిలో తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నందకిషోర్ అన్నారు. బుధవారం మండలంలోని కడలి, చింతలపల్లి, కూనవరం గ్రామాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించి వరిపొలాలను పరిశీలించారు. వరిలో జింక్ లోపం, కాండం తొలిచే పురుగు, ఎండాకు తెగులు ఆశించడాన్ని గమనించామని ఏవో వై.మధుకుమార్ తెలిపారు. జింక్ లోపాన్ని నివారించేందుకు రైతులకు పలు సూచనలు చేశారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ


టీషర్ట్‌లను క్రీడాకారులకు అందజేస్తున్న హెచ్‌ఎం

అంబాజీపేట: ఇటీవల మండల స్థాయిలో జరిగిన ఆటల పోటీలకు సంబంధించి ఖోఖో విభాగంలో ప్రథమ స్థానం సాధించిన తొండవరం హైస్కూల్ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ బహూకరించిన టీషర్టులను మంగళవారం పంపిణీ చేశారు. హైస్కూలులో జరిగిన ఒక కార్యక్రమంలో హెచ్ఎం పీవీ కేశవాచార్యుల పర్యవేక్షణలో క్రీడాకారులకు పంపిణీ చేశారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ దాతలు ఇచ్చిన ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని మరింత రాణించాలన్నారు. మండల స్థాయిలో సత్తా చూపిన తమ హైస్కూలు విద్యార్థులు త్వరలో జిల్లా స్థాయిలో జరిగే ఖోఖో పోటీలలో పాల్గొంటారని పీడీ పి.సూర్యనారాయణ తెలిపారు.